

సాగు సరే... పరిశ్రమ ఏది?

- త్రిశంకు స్వర్గంలో ఆయిల్‌పామ్ రైతులు
- త్వరలో చేతికి రానున్న మొదటి పంట
- కనిపించని మార్కెటింగ్ జాడ
- ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలదే బాధ్యత అంటున్న అధికారులు
- ఇప్పటికీ ప్రారంభం కాని ఫ్యాక్టరీల ఏర్పాటు ప్రక్రియ

వివరాలు 7లో..



భద్రాద్రికొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేటలోని ఆయిల్‌పామ్ రిఫైనరీ పరిశ్రమ (ఫైల్)

సంప్రదాయ పంటలు సాగు చేసి కష్టాలు, నష్టాలతో కాలం నెట్టుకొస్తున్న రైతులను ఆర్థికంగా పరిపుష్టం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. దీంతో రైతులు కూడా ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెడుతున్నారు. అలా సాగయిన మొదటి పంట త్వరలో చేతికిరానుంది. ఇది అన్నదాతలకు సంతోషకరమే అయినా.. పంటకోత, ఫ్యాక్టరీలకు తరలింపు, మార్కెటింగ్ లాంటి విషయాలు వారిని ఆందోళనకు గురిచేస్తున్నాయి. 2020-21లో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని తీసుకురాగా.. భూపాలపల్లి జిల్లాలో వేసిన ఆయిల్‌పామ్ పంట ఇప్పుడు చేతికి రాబోతోందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ జిల్లాలో సాగు చేసిన మొత్తం 3,650 ఎకరాల్లో.. ఈ ఏడాది సుమారు 353 ఎకరాల్లో మొదటి సారి గెలలు కోయనున్నారు. కానీ ఇక్కడ రిఫైనరీ పరిశ్రమ లేకపోవడంతో పంట రవాణా, క్రషింగ్ విషయంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దీనిపై దృష్టిపెట్టి తమ సమస్యకు పరిష్కారం చూపాలని ఆయిల్‌పామ్ రైతులు కోరుతున్నారు.

- భూపాలపల్లి, ఆంధ్రజ్యోతి

అమాత్యా.. ఆలకించరూ!



రామప్ప కాలనీ క్వార్టర్స్ పరిసరాల్లో మెడికల్ కాలేజీ క్యాంపస్ నిర్మాణం కోసం చదును చేసిన స్థలం

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ ఆస్పత్రులకు మోక్షం కలిగేనా? జిల్లాలో సొంత భవనాలు లేకుండా నిట్టూరుస్తున్న సబ్ సెంటర్ల పనులు వేగం పెరిగేనా... ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత తీరేనా... పీహెచ్‌సీలకు సొంత భవనాలు మంజూరు అయ్యేనా.. అనే ఆశతో జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదార రాజనర్సింహా వస్తుండటంతో సమస్యలకు మోక్షం కలిగేనా.. అని జిల్లా ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. మరి మంత్రి రాజనర్సింహా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారో లేక ఉసూరు మనిపిస్తారో చూడాలి.

సమస్యల వలయంలో ప్రభుత్వాస్పత్రులు

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. శాశ్వత భవనాలు, సరిపడా సిబ్బంది లేకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. జిల్లాలోని 90 సబ్ సెంటర్లలో 21 సబ్ సెంటర్లకు మాత్రమే శాశ్వత భవనాలున్నాయి. మిగిలిన 61 సబ్ సెంటర్ల భవనాలకు ప్రభుత్వం రూ.3కోట్లకు పైగా కేటాయించింది. ప్రభుత్వం నిధులు కేటాయించినా భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో సెంటర్లలో అరకొరగానే సేవలు అందుతున్నాయి. మంత్రి దామోదార రాజనర్సింహా సబ్ సెంటర్ల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు. కాళేశ్వరం, గోరికొత్తపల్లి కేంద్రాలకు పీహెచ్‌సీ సొంత భవనాలు కేటాయించాల్సి ఉంది. రేగొండ మండలం నుంచి గోరికొత్తపల్లి మండలం ఏర్పాటు అయినప్పటికి ఇప్పటి వరకు పీహెచ్‌సీ సేవలు ప్రారంభం కాలేదు. రేగొండ పీహెచ్‌సీ నుంచే సేవలందుతున్నాయి. మండలంకు నూతన పీహెచ్‌సీ కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. కాళేశ్వరంకు నూతన పీహెచ్‌సీని కేటాయించిన గత ప్రభుత్వం నూతన భవనంను మాత్రం నిర్మించలేదు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లోనే సేవలు అందిస్తున్నారు. అక్కడ కూడా శాశ్వత భవనం కేటాయించాల్సి ఉంది. దీంతో పాటు జిల్లా కేంద్రంలో గతంలో సేవలు అందించిన పీహెచ్‌సీ జీజీహెచ్‌కు అప్‌గ్రేడ్ కావడంతో భూపాలపల్లికి పీహెచ్‌సీ సేవలు అంతంతమాత్రంగా ఉన్నాయి. భూపాలపల్లి మండల గ్రామాలకు వైద్యసేవలు విస్తృతం చేసేందుకు పీహెచ్‌సీ నిర్మాణం చేయాల్సి ఉంది. దీంతో పాటు కాటారం, మొగుళ్లపల్లి, గణపురం, మహదేవపూర్ మండలాల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా వైద్యసేవలు అందించేందుకు నూతన సబ్ సెంటర్ల ఏర్పాటుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పంపిన ప్రతిపాదనలకు మంత్రి మంజూరు చేయాల్సి ఉంది.

- సమస్యల వలయంలో ప్రభుత్వాస్పత్రులు
- సబ్‌సెంటర్లకు సొంత భవనాలు కరువు
- కాళేశ్వరం, గోరికొత్తపల్లి పీహెచ్‌సీలకు భవనాల మంజూరుపై ప్రకటన చేసేనా?
- జనాభా ప్రాతిపదికన కొత్త సబ్‌సెంటర్లకు ఒకే చెప్పేనా
- తాత్కాలిక భవనాల్లోనే మెడికల్ కాలేజీ, హాస్టల్ నిర్వహణ
- జిల్లా ఆస్పత్రిలో మరిన్ని సేవలకు మోక్షం కలిగేనా!
- నేడు భూపాలపల్లి జిల్లాలో వైద్యశాఖ మంత్రి పర్యటన

సిబ్బంది కొరత తీరేనా..

జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఆస్పత్రిలో ఉన్న అరకొర సిబ్బందితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో 14 మంది ఎంబీబీఎస్ వైద్యుల పోస్టుల ఖాళీగా ఉండటం పరిస్థితికి అద్దం పడుతున్నా జిల్లా ఆస్పత్రిలో పలు శంకుస్థాపనలు చేయనున్న మంత్రి వైద్యుల భర్తీపై ప్రకటన చేయాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా వైద్యశాఖలో కూడా ఖాళీలు ఉన్నాయి. 12 మంది ఎంఎల్‌హెచ్‌సీలు, 50 మంది మొదటి ఏఎన్‌ఎంలు ఖాళీలు ఉండటంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. జిల్లా పర్యటనలో మంత్రి ఖాళీల భర్తీకి ప్రకటన చేయాలని కోరుతున్నారు.

కలెక్టరేట్ తలుపు తడుతున్న విద్యార్థులు

మెడికల్ కాలేజీలో సమస్యలు తిష్టవేయడంతో సమస్యలను ఏకరువు పెట్టేందుకు విద్యార్థులు కలెక్టర్ కార్యాలయం తలుపు తడుతూనే ఉన్నారు. ఇటీవల గర్ల్స్ హాస్టల్‌లో తాగుబోతులు వీరంగం చేయడంతో భయబ్రాంతులకు గురైన విద్యార్థులు కలెక్టర్ రాహుల్ శర్మకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే కాలేజీ వ్యవహారాలు, విద్యార్థుల బాగోగులు చూడాల్సిన ప్రిన్సిపాల్ తనకేమి పట్టనట్లు వ్యహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండవ సంవత్సరం విద్యార్థులకు హాస్టల్ ఏర్పాటులో చొరవ తీసుకోవాల్సిన ప్రిన్సిపాల్ గాలికి వదిలేయడంతో చేసేదేమిలేక విద్యార్థులు రోడ్డెక్కడంతో రంగంలోకి దిగిన కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాస్టల్ ఏర్పాటు చేశారు. ప్రతి విషయంతో ప్రిన్సిపాల్ ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో విద్యార్థులు కలెక్టర్ రాహుల్ శర్మ చెంతకు పరుగులు తీస్తున్నారు. ప్రిన్సిపాల్ విషయంలో ప్రభుత్వ చర్యలకు విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

అన్నీ తాత్కాలిక భవనాలే..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో 2023 సెప్టెంబరు 15న భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రారంభించింది. కాలేజీ ఏర్పాటుకు శాశ్వత భవనం అందుబాటులో లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం రూ.33 కోట్లతో రామప్ప కాలనీ క్వార్టర్స్ సమీపంలో నిర్మిస్తున్న 250 పడకల ఆస్పత్రి భవనంలో తాత్కాలికంగా తరగతులు ప్రారంభించింది. తరగతుల నిర్వహణకు ఆస్పత్రిలో నిర్మాణంలో పలు మార్పులు చేశారు. విద్యార్థులకు వసతి కోసం పక్కనే ఉన్న రామప్ప కాలనీ క్వార్టర్స్‌లో యువతి, యువకులకు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వసతి ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా 28 క్వార్టర్స్‌ను వినియోగించారు. మొదటి సంవత్సరం 100 మెడికోలతో పాటు ఈ సంవత్సరం కాలేజీలో చేరిన మరో 100 మంది మెడికోలకు రామప్ప క్వార్టర్స్‌లోనే వసతి ఏర్పాటు చేశారు. విద్యార్థులు, అధ్యాపకుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.130 కోట్లతో మెడికల్ కాలేజీ క్యాంపస్ పనులను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదార రాజనర్సింహా శంకుస్థాపన చేయనున్నారు.

తాడ్వాయి - మంగపేట

అడవుల్లోనే పెద్దపులి

పాదముద్రలను పరిశీలించిన కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్

పరిసర గ్రామాల్లో భయంభయం

6లో..



తాడ్వాయి అడవుల్లో పెద్దపులి పాదముద్రలను పరిశీలిస్తున్న సీసీఎఫ్ ప్రభాకర్, సిబ్బంది

గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో 2,195 మంది అభ్యర్థులు

ములుగు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 15, 16 తేదీల్లో జరిగే పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలతోపాటు జాకారం సాంఘిక సంక్షేమ గురుకులంలో, మొత్తం తొమ్మిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిర్వహణ కోసం అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించారు. జిల్లాలో 2,195 మంది అభ్యర్థులు ఉండగా వీరిలో 55 మంది దివ్యాంగులు ఉన్నారు. అరుగురు దివ్యాంగుల తరఫున పరీక్ష రాసేందుకు ప్రభుత్వం సహాయకుల కోసం అనుమతించింది. 26 మంది చొప్పున డిపార్టుమెంట్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, అబ్జర్వర్లను నియమించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నిర్ణీత సమయానికి గంట ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని వెల్లడించారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..


బండారుపల్లి మోడల్ స్కూల్, బిట్స్ హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ములుగు బాలుర జడ్పీహెచ్‌ఎస్, జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్, బ్రిలియంట్ హైస్కూల్, సాధన హైస్కూల్.

బాధిత మహిళలకు

సమర్థవంతంగా సేవలందిస్తున్నాం..

- సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ గాయత్రి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎ.గాయత్రి

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో 2020లో సఖి కేంద్రాన్ని అప్పటి మంత్రి సత్యవతిరాథోడ్, అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, అప్పటి కలెక్టర్ అబ్దుల్ అజీమ్‌లు ప్రారంభించారని, అప్పటి నుంచి ఈ కేంద్రంలో సమర్థవంతంగా సేవలందిస్తున్నామని సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ ఎ.గాయత్రి స్పష్టం చేశారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఎన్‌జీవో దరికి సఖి కేంద్రం' కథనంపై ఆమె శుక్రవారం స్పందించారు. ఇప్పటి వరకు మొత్తంగా 802 కేసులకు గాను 670 కేసులు పరిష్కరించినట్లు వివరించారు. సఖి సెంటర్ ప్రారంభంలో 14 మంది పూర్తి స్టాఫ్ ఉండేదని, కొంత మందికి వేరే ఉద్యోగాలు రావడంతో రిజైన్ చేశారని, సరైన స్టాఫ్ లేకపోయినా, నెలలు నెలలుగా జీతాలు, ఎక్స్‌పెండేచర్స్ ఇవ్వకపోయినా 24 గంటలు అందుబాటులో ఉంటూ సత్వర న్యాయాన్ని కలిపిస్తున్నామని పేర్కొన్నారు. గత మూడేళ్లుగా సఖి సెంటర్‌కు ఎన్జీవో లేకపోయినా జిల్లా సంక్షేమాధికారి ఆధ్వర్యంలో బాధితుల సమస్యలను పరిష్క రిస్తున్నామన్నారు. ఇక ముందు కూడా ఏ సంస్థ వచ్చినా అదేవిధంగా తమ విధులు మరింత సమర్థతతో నిర్వర్తిస్తామని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో ఎటువంటి వేధింపులకు గురవుతున్న మహిళలు, ఆడపిల్లలు ఎవరైనా నిర్భయంగా 181కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని గాయత్రి కోరారు.



డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద నిరసన తెలుపుతున్న వారికి సంఘీభావం ప్రకటిస్తున్న వెంకటరమణారెడ్డి

పేదల బాధలు తీర్చేందుకు జైలుకెళ్లడానికైనా సిద్ధం

- వారికి ఇచ్చే ఇళ్లతో రాజకీయాలు చేయొద్దు
- ఎమ్మెల్యేకు పేదలపై ప్రేమ ఉంటే పట్టాలివ్వాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కాకతీయఖని, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల బాధలను తీర్చేందుకు జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని, వారి బతుకులతో రాజకీయాలు చేయొద్దని, వారికి కేటాయించిన ఇళ్లకు వెంటనే పట్టాలు ఇవ్వాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని భాస్కరగడ్డలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద దరఖాస్తుదారులు నిరసన చేపట్టారు. వీరికి వెంకటరమణారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.2204.80 లక్షలతో 416 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేదల కోసం నిర్మించిందన్నారు. అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌తో 2023 అక్టోబరు 8న వాటిని ప్రారంభించి కొందరికి పట్టాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన వారికి ఇద్దామనుకునేలోపే ఎన్నికల కోడ్ రావడంతో అవి నిలిచిపోయాయన్నారు. ఈ లోపే ఎన్నికలు జరగడం ప్రభుత్వం మారడం జరిగిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని, వారి కార్యకర్తలకు ఇచ్చేందుకు అలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు పేద ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసినట్లు మాకు సమాచారం ఉందన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు పేద ప్రజల పట్ల నిజంగా ప్రేమ ఉంటే వెంటనే ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం అవుతుందన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను కలిసి అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. పట్టాలు ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఫోన్‌లో కోరారు. దీనికి వారు త్వరలోనే ఇళ్ల పట్టాలు ఇస్తామని తెలిపారన్నారు.

మా పట్టాలు మాకిప్పించండయ్యా..

మాకు కేటాయించిన ఇళ్లకు పట్టాలు వచ్చేంత వరకు ఇక్కడి నుంచి వెళ్లొద్దంటూ మహిళలు మాజీ ఎమ్మెల్యే చుట్టూ కూర్చున్నారు. ఎంతో కాలంగా ఇళ్లు లేకుండా ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లకు పట్టాలు వస్తే మా బతుకులు మారుతాయని వెంకటరమణారెడ్డికి విన్నవించుకున్నారు. కిరాయి ఇళ్లలో ఉంటున్నామని, ఇంట్లో ఎవరైనా మరణిస్తే ఇంటి యజమాని బయటకు పంపిస్తున్నారని ఆందోళన చెందారు. మీకు పట్టాలు వచ్చేంత వరకు మీ వెంటే ఉంటానని రమణారెడ్డి హామీ ఇచ్చారు. మునిసిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, వైస్ చైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డి, నాయకులు మాడ హరీష్‌రెడ్డి, దార పూలమ్మ, భాగ్యలక్ష్మీ, రాజు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కాకతీయఖని, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా శనివారం జిల్లాలో పర్యటించనున్నందున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, వంద పడకల ఆస్పత్రిలో రివ్యూ మీటింగ్, అంబేద్కర్ సెంటర్‌లో ప్రజాపాలన విజయోత్సవ సభ(పబ్లిక్ మీటింగ్)కు మంత్రులు హాజరవుతారని అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు హాజరై మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

హెలీప్యాడ్ స్థలం పరిశీలన

రేగొండ : మండలంలోని రామన్నగూడెం గ్రామ శివారులో శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. శనివారం మంత్రుల పర్యటన సందర్భంగా హెలీకాప్టర్ రేగొండ మండలంలో ల్యాండ్ కానుంది. ఈ సందర్భంగా మంత్రులు బుద్దారం గ్రామం నుంచి కొడవటంచకు రూ.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. పోలీసులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారితో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, పీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ దామోదర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు సంపత్‌రావు, నాయకులు నర్సన్న, పున్నం రవి, మేకల భిక్షపతి, రవికుమార్, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

- ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

కాటారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటారం-విలాసాగర్ రహదారిపై ధర్మసాగర్ గ్రామ సమీపంలో శుక్రవారం ట్రాక్టర్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన ఐలి శ్రీనివాస్, మహదేవపూర్ మండలంలోని బొమ్మాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం... శ్రీనివాస్ బైక్‌పై ధర్మసాగర్‌లో బంధువుల దశదినకర్మకు హాజరై దగ్గరి బంధువైన లక్ష్మిని తీసుకుని బైక్‌పై కాటారం వైపు వస్తున్నారు. ధర్మసాగర్‌లోని మల్లికార్జున్‌కు చెందిన ట్రాక్టర్ గుమ్మళ్లపల్లి నుంచి ధర్మసాగర్ వెళ్తుంది. ఇంతలో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టి రోడ్డు కిందకు దూసుకెళ్లగా ట్రాలీ బోల్తాపడింది. ప్రమాదంలో శ్రీనివాస్ తలకు, లక్ష్మీ కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. కాగా, శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించాలని వైద్యులు చెప్పారని బంధువులు తెలిపారు.

క్రైం కార్నర్

పాముకాటుతో రైతు మృతి

వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని ఆందోళన

వెంకటాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాముకాటుతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కొండాపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం... కొండాపురం గ్రామానికి చెందిన సోమేశ్వర్‌రావు(38) తన మిరప తోటలో పని చేసుకునేందుకు ఉదయం వెళ్లాడు. ఈ క్రమంలో తోటలో కలుపు తీస్తుండగా పాము కాటువేసింది. గమనించిన కుటుంబసభ్యులు సోమేశ్వర్‌రావును వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా, వైద్యశాలలో వైద్యసిబ్బంది సోమేశ్వర్‌రావును తీసుకువచ్చిన గంట తర్వాత వైద్యసేవలు ప్రారంభించారని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో పాటు ఏటూరునాగారం వైద్యశాలకు రెఫర్ చేశారని అన్నారు. ఈ క్రమంలో సోమేశ్వర్‌రావును ఏటూరునాగారం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు మృతదేహాన్ని వెంకటాపురం వైద్యశాలకు తీసుకువచ్చి సిబ్బంది నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై కొప్పుల తిరుపతిరావు వైద్యశాలకు చేరుకుని కుటుంబసభ్యులు, బంధువులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.

ఆరోగ్య అమాత్యా.. నన్ను పట్టించుకోండి..



అయ్యా.. ఆరోగ్య మంత్రి గారూ.. మీరు బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయింది. కానీ నావైపు ఒక్కసారికూడా కన్నెత్తి చూడలేదు. ఉత్తర తెలంగాణాలోనే పెద్ద ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన నేను అనేక సమస్యలతో సతమతం అవుతున్నాను. ఉమ్మడి వరంగల్‌జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకుండా ఛత్తీస్‌గడ్ నుంచి కూడా ఎంతో మంది వైద్యం కోసం వస్తుంటారు. కానీ అరకొర సౌకర్యాలతో నా ఘనచరిత్ర మసకబారుతోంది. రోగుల సంఖ్య పెరుగుతున్నా.. పడకల సంఖ్య పెరగడం లేదు. కనీసం పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌ను కూడా నియమించలేదు. దీంతో రోగులకు అందించే వైద్య సేవలను పర్యవేక్షించే వారు లేరు. ఇక వైద్య ఆరోగ్య శాఖలో జరిగిన బదిలీలు నా సేవలను మరింత దిగజార్చాయని అందరూ అంటున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిపోయే వైద్యులు నామమాత్రంగా సేవలు అందిస్తున్నారని రోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు రోగనిర్ధారణలో కీలకమైన వైటల్ టెస్టులు, ఎక్స్‌రే తీసే మిషన్లు పనిచేయకపోవడం వారికి పెద్ద శాపంగా మారింది. చివరకు పేద రోగులు నన్ను అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం నాపై దృష్టి పెట్టి గతంలో మాదిరిగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా.. నా ఘన చరిత్రను కాపాడేలా.. చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

ఇట్లు
ఎంజీఎం ఆస్పత్రి,
వరంగల్ మెడికల్, ఆంధ్రజ్యోతి

క్రైం వార్తలు

మానుకోటలో వ్యక్తి అదృశ్యం


పాపయ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర బజారుకు చెందిన దాసరి పాపయ్య కన్పించడంలేదని టౌన్ సీఐ దేవేందర్ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. వేంకటేశ్వరబజారుకు చెందిన దాసరి పాపయ్య గత నాలుగు రోజుల క్రితం కుటుంబసభ్యులకు ఎవరికి చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. నాటి నుంచి పాపయ్య ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇండ్ల వద్ద ఆరా తీసినట్లు చెప్పారు. ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పాపయ్య కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు గుండ్లకుంట కాలనీకి చెందిన జాకోజు ధనమ్మ (70) వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ సీఐ దేవేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. గుండ్లకుంట కాలనీకి చెందిన ధనమ్మకు భర్త, పిల్లలు లేకపోవడంతో ఒంటరిగానే జీవనం గడుపుతోంది. గత కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురికావడంతో అదే కాలనీకి చెందిన తనచెల్లి సరోజన రోజు వచ్చి అన్నం తెచ్చిఇచ్చి వెళ్లేది. శుక్రవారం మధ్యాహ్నం సరోజన అన్నం తీసుకుని వచ్చే సరికి అక్క ధనమ్మ ఉరివేసుకుని కన్పించింది. దీంతో వెంటనే సరోజన డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి చెల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటోను ఢీకొన్న గేదె : ఒకరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు మహర్షి విద్యాలయ సమీపంలో ఓ ఆటోను గేదె ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కేసముద్రం నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న ఆటోలో ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు. ఆటో మహర్షి స్కూల్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా అటుగా వచ్చిన గేదె వెళ్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న కేసముద్రం విలేజ్‌కు చెందిన దర్మనం సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరందరిని 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

దంతాలపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దముప్పారం-దంతాలపల్లి ప్రధాన రహదారిపై గల తూర్పుతండా శివారు దుబ్బతండా స్టేజీ వద్ద శుక్రవారం జరిగిన ఎదురెదురు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. తొర్రూరు మండలం చిన్నవంగ గ్రామ శివారు వంపు తండాకు చెందిన దేవేందర్ తూర్పుతండా శివారు రేఖ్యాతండా నుంచి దంతాలపల్లి వైపు వెళ్లుతున్న క్రమంలో, దంతాలపల్లి వైపు నుంచి వస్తున్న మరో బైకిస్టు మాలోతు సుమన్ బైక్‌లు ఎదురెదురు ఢీకొనడంతో వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. కాగా, వారిని స్థానికులు హుటాహుటీన ప్రైవేటు వాహనంలో చికిత్స నిమిత్తం తొర్రూరుకు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు ఆశలు.. ఆవిరేనా?

ఎండమావిగా బయ్యారం ఐరన్‌ఓర్ కర్మాగారం

కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో ఏజెన్సీలో తీవ్ర నిరాశ

పోరాటాలకు సిద్ధమవుతున్న సాధన కమిటీ

బయ్యారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం మండలంలో ప్రభుత్వ రంగ సంస్థ ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై ఆశలు ఆవిరైనట్టేనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు తాజాగా కేంద్రం పార్లమెంట్ వేదికగా చేసిన ప్రకటన అందరినీ నిరాశకు గురిచేసింది. దశాబ్ద కాలంగా సర్వేలతో కాలయాపన చేస్తూ వచ్చిన కేంద్రప్రభుత్వం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యం కాదని పేర్కొనడంతో స్థానికంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ఎండమావిగా మారిన ఉక్కు కర్మాగారాన్ని సాధించుకునేందుకు సాదన కమిటీ పోరాటాలకు సిద్ధమవుతోంది.

ఉద్యమానికి ఉత్ప్రేకరంగా..?

'బయ్యారం ఉక్కు.. తెలంగాణ హక్కు..' అంటూ మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాలకు ఉత్ప్రేరకంగా మారిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై నాడు యూపీఏ ప్రభుత్వం స్పందించింది. ఈ అంశాన్ని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచ్చింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 13వ షెడ్యూల్‌లో బయ్యారం మండలంలో స్టీల్ ఆథారటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ఆధ్వర్యంలో రూ.36వేల కోట్ల వ్యయంతో ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పుతామంటూ విభజన చట్టంలో పేర్కొన్న విషయం తెలిసిందే. కానీ, నేటికి దశాబ్ద కాలం గడిచినా కార్యరూపం దాల్చకపోవడంతో ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు దక్కక యువకులు, నిరుద్యోగులు తల్లడిల్లుతున్నారు. అంతేకాక విభజన చట్టానికి భిన్నంగా బయ్యారంలో ఉక్కు కర్మాగారం నెలకొల్పడం సాధ్యం కావడంలేదని, ఖనిజం నాణ్యత లేదంటూ ఇటీవల లోక్‌సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించడంతో ఉక్కుకర్మాగారం ఆశలు అడుగంటాయి. దీంతో స్థానికంగా తీవ్ర ఆవేదన నెలకొంది. కేవలం సమీక్షలు, సర్వేల పేరుతో కాలయాపన మినహా కర్మాగారం ఏర్పాటుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

దాదాపు 30 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ఆశతో దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న స్థానిక ప్రజానీకానికి తాజా ప్రకటనతో మింగుడు పడటంలేదు. ఓ పక్క విశాఖ ఉక్కు ఫ్యాక్టరీనే కేంద్రప్రభుత్వం అమ్మకానికి పెడుతుండటం.. మరోపక్క బయ్యారం కర్మాగారం సాధ్యం కాదంటూ ప్రకటన చేయటంతో పాలుపోని స్థితిలో స్థానికులున్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం స్పందించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని బయ్యారంలో ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో స్టీల్ ఫ్యాక్టరీ నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఫ్యాక్టరీ లాభసాటి!

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీతో పోలిస్తే బయ్యారం ఉక్కు కర్మాగారం లాభసాటిగా ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. విశాఖ కర్మాగారానికి ముడి ఖనిజంతో పాటు డోలమైట్, బొగ్గు, విద్యుత్ వనరులను తెలంగాణ, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కానీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పూర్తిస్థాయిలో ఇనుప ఖనిజం లభ్యమవుతుందని గతంలో మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ) గుర్తించిన సంగతి తెలిసిందే. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల పరిధిలో 56,690 హెక్టార్ల భూముల్లో ఇనుప ఖనిజం నిల్వ ఉన్నట్లు ఎన్‌ఎండీసీ గతంలో గుర్తించింది. దీంతో పాటు బయ్యారానికి 50 కిలోమీటర్ల పరిధిలోనే సింగరేణి కాలరీస్ బొగ్గు, మద్దారం డోలమైట్ ఖనిజం, మూడు జిల్లాల పరిధిలో ఇనుపఖనిజం లభ్యం కావడంతో పాటు అత్యంత సమీపాన రైలు మార్గం, విద్యుత్, నీటి సౌకర్యాలు అందుబాటులో ఉండటం, భూమి సైతం సమృద్ధిగా ఉండటం లాంటి సానుకూల అంశాలు ఉన్నా కేంద్రప్రభుత్వం విముఖత చూపటం పట్ల తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక బయ్యారంలో ఉక్కు కర్మాగారానికి ముడి ఇనుప ఖనిజాన్ని సమీపంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్‌పూర్ ఏరియా బైలడిల్లా నుంచి 180 కిలోమీటర్ల రైలు మార్గం ఏర్పాటు చేసుకొని దిగుమతి చేసుకొనే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.


బయ్యారంలో వెలికితీసిన ఇనుప ఖనిజం (ఫైల్)

సెయిల్ వెనకడుపై విస్మయం..

తెలంగాణ ప్రజాప్రతినిధులు ప్రధానమంత్రిని, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధేలను ఎన్ని పర్యాయాలు కలిసినా వారిమొర అరణ్యరోధనగానే మారింది. జీయాలిజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెయిల్, సింగరేణి, కేంద్ర పరిశ్రమల శాఖ మెకాన్ సంస్థలు సర్వేలు, చేయడం ఫ్యాక్టరీ ఏర్పాటుకు డీపీఆర్‌లు రూపొందించినా సెయిల్ కర్మాగారం నెలకొల్పడానికి వెనుకడుగు వేయటం నాణ్యత తక్కువ ఉందంటూ సాకులు చెప్పడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే తాజాగా పార్లమెంట్ వేదికగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా సెయిల్ నిర్ణయాన్ని బలపరిచేలా ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పడం సాధ్యం కాదంటూ ప్రకటించడం ఈ ప్రాంత వాసుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి బయ్యారం ఇనుప ఖనిజం తక్కువ నాణ్యత కలిగి ఉంటే గతంలో ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు బయ్యారం ఇనుప ఖనిజం కోసం ఎందుకు వెంపర్లాడారాని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు బయ్యారం ఇనుప ఖనిజం కోసం అర్రులు చాస్తుండగా.. సెయిల్ ఎందుకు వెనకడుగు వేస్తుందన్న ప్రశ్నలు చర్చనీయాంశమైయ్యాయి.

రూ. 500 కోట్ల ఖనిజం తరలింపు..!

2004 నుంచి 2009 వరకు దాదాపు ఐదేళ్ల పాటు బయ్యారం ప్రాంతం నుంచి ప్రైవేట్ సంస్థలు సుమారు రూ.500 కోట్లు విలువ చేసే ఇనుప ఖనిజాన్ని తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబీకులు రక్షణ స్టీల్స్ పేరుతో మూడు జిల్లాల పరిధిలో ఇనుప ఖనిజం ఉన్న దాదాపు రెండు లక్షల ఎకరాల భూములు ఎందుకు కేటాయింపజేసుకున్నారని? ఎందుకు కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు లక్షలాది టన్నుల ఖనిజ సంపదను తరలించుకుపోయారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 30వేల మందికి ఉపాధి లభిస్తుందన్న ఆశతో ఉక్కు కర్మాగారం కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు. కేంద్రం వెనుకడుగు వేయటంతో ప్రైవేట్ రంగ ఉక్కు ఉత్పాదక సంస్థలు బయ్యారంలో ఉక్కు కర్మాగారం నెలకొల్పేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. గతంలో జిందాల్ లాంటి సంస్థల ప్రతినిధులు బయ్యారం ఖనిజ సంపదను పరిశీలించి, వెళ్లడమే అందుకు ఉదాహరణ. అంతేకాక ఇటీవల సైతం రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం బయ్యారం ఇనుపఖనిజ సంపద కర్మాగారం అంశాలపై నివేదిక కోసం సంబంధిత శాఖలను కోరినట్లు తెలిసింది.

ఉక్కు సాధన పోరాటాన్ని ఉధృతం చేస్తాం



కేంద్రప్రభుత్వ నిర్ణయం సమంజసం కాదు. కుంటి సాకులతో ఉక్కు పరిశ్రమను నిరాకరిస్తోంది. ఉక్కు కర్మాగారం కోసం మా పోరాటాన్ని ఉధృతం చేస్తాం. వనరులు పుష్కలంగా ఉన్నా బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ సాధ్యం కాదంటూ రాతపూర్వకంగా పేర్కొనడం హాస్యాస్పదం. విభజన చట్టంలో ముడి ఖనిజ నిల్వల ప్రస్తావనే రాలేదు. ఉక్కుపరిశ్రమ స్థాపనకు ఖనిజ నిల్వలకు సంబంధమే లేదు. ముడిఖనిజ నిల్వలు ఏం ఉన్నాయని విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేశారు. అక్కడి కంటే బయ్యారానికే తక్కువ దూరం నుంచి ఖనిజాన్ని దిగుమతి చేసుకోవచ్చు. బయ్యారం ఉక్కు పరిశ్రమ తెలంగాణ ప్రజలు సాధించుకున్న చట్టబద్ధమైన హక్కు. అది సాధ్యం కాదని ప్రకటించే హక్కు, అధికారం కేంద్ర ప్రభుత్వానికి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేదు. విభజన హామీ అమలుకు కృషి చేయాల్సిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యం కాదని పార్లమెంట్ వేదికగా ప్రకటించడం బాధ్యతా రాహిత్యమే. కేంద్రం స్పందించి బయ్యారంలో స్టీల్ పరిశ్రమ నెలకొల్పకపోతే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు.

-గౌని ఐలయ్య, ఉక్కు పరిశ్రమ సాధన కమిటీ కన్వీనర్

సరస్వతీ పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయండి

భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు..

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

మహదేవపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నదీ పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని, వచ్చే ఏడాది జరిగే ఈ పుష్కరాలకు రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రం భక్తులు కూడా వస్తారని, వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంతి కొండా సురేఖ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది పుష్కరాలు రానున్న నేపథ్యంలో నిర్వహణకు అధికారులు అంచనా నివేదికలు తయారు చేసి పంపాలన్నారు. దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, సమాచార, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలు అవసరమయ్యే అంచనాలు తయారు చేయాలన్నారు. స్నాన ఘట్టాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

గత పుష్కరాలకు 30వేల మంది భక్తులు వచ్చారని, ఈసారి 50వేల మంది భక్తులు వచ్చే అవకాశమునట్టు అధికారులు మంత్రికి వివరించారు. ఇందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రస్తుతం ఉన్న వారితో పాటు పుష్కరాలు జరిగే కాల పరిమితికి ప్రత్యేకంగా కొందరిని నియమించాలని కలెక్టర్, ఈవోను ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా ఇతరత్రా పనులన్నీ సక్రమంగా ఉండాలన్నారు. 12 రోజుల పాటు జరిగే ఈ పుష్కరాలకు ప్రతీ రోజు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయమై పనిచేయాలని, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తనకు నేరుగా తెలియజేయాలన్నారు. ఈ రివ్యూలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్, శ్రీధర్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఎండీ ప్రకాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, కాళేశ్వరం ఆలయ ఈవో మారుతి తదితరులు పాల్గొన్నారు.


రివ్యూలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- టీజేఏస్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న డోలి సత్యనారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అమలు చేస్తున్న ప్రతీ పథకాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్తున్న సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్‌ఏ) ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ జనసమితి (టీజేఎస్) జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించిన ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సమయపాలన పాటిస్తూ విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తున్న ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు.

పీఆర్టీయూ-టీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా మండల విద్యాశాఖ కార్యాలయాలకు, ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానకర్తలుగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌ఏ ఉద్యోగులతో ప్రభుత్వం చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో వీరన్న, ఖాదర్, ఉదయ్, నవీన్, ప్రభావతి, మంజుల, మున్నీ, భవాని, సరస్వతి, నీలిమా, విజయలక్ష్మీ, మాధురి, ప్రభాకర్, వీరయ్య, జ్యోతి, వీరన్న, ఉప్పలయ్య, రవీందర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా టీటీఎఫ్, టీఎస్-యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

పనిచేయని ఎక్స్ రే యంత్రాలు

దురుసుగా సమాధానం చెబుతున్న సిబ్బంది

వరంగల్ మెడికల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎంలో ఎక్స్‌రే యంత్రాలు పని చేయడం లేదు. వివిధరకాల రోగ నిర్ధారణ కోసం ఎక్స్‌రే తప్పనిసరిగా అవసరం అవుతుంటాయి. ఇక ఆర్థో విభాగంలోనైతే ఎక్స్‌రే లేనిదే ఎలాంటి చికిత్స అందించడం వీలుకాదు. రోగ నిర్ధారణలో ఇంత ప్రతిష్ఠాత్మ కంగా మారిన ఈ పరీక్షలకు సంబంధించిన యం త్రాలు పనిచేయడం లేదు.

రోజూ వందలాదిమంది రోగులతో కిటకిటలాడే ఎంజీఎం ఆస్పత్రి రూమ్ నెంబరు 92లో ఈ మిషన్లు ఉన్నాయి. శుక్రవారం ఉదయం రోగులు ఈ పరీక్షల కోసం రాగా, అక్కడ పనిచేసే సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని రోగులు వాపోతున్నారు. కనీసం ఎప్పటివరకు యంత్రాలు మరమ్మతు అవుతాయని కూడా చెప్పడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధి కారులు ఇప్పటికైనా స్పందించి ఎక్స్‌రే సేవలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తాడ్వాయి - మంగపేట అడవుల్లోనే పెద్దపులి

పాదముద్రలను పరిశీలించిన కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్

పరిసర గ్రామాల్లో భయంభయం

తాడ్వాయి/మంగపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజుల క్రితం మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి ములుగు జిల్లాలోకి ప్రవేశించిన పెద్దపులి తాడ్వాయి - మంగపేట అడవుల్లో సంచరిస్తోంది. అది రెండు రోజులుగా తాడ్వాయి మండలం పంబాపూర్-దామెరవాయి, మంగపేట మండలం కొత్తూరు మొట్లగూడెం పరిసర అటవీ ప్రాంతంలో తిరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. మూడు రోజుల పాటు సుదీర్ఘ ప్రయాణం చేసిన పులి శుక్రవారం ఒకే ప్రాంతంలో ఉన్నట్టు స్పష్టమవుతోంది. పంబాపూర్-దామెరవాయి, కొత్తూరు మొట్లగూడెం మధ్యలోని గుట్టలు, వాగుల వెంట సంచరిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు గుర్తించారు. కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శుక్రవారం అడవుల్లోకి వెళ్లారు.

నీటి తావుల వద్ద పులి పాదముద్రలను వారు గుర్తించారు. ఒకరోజు ముందే పులి అక్కడికి వచ్చివెళ్లినట్టు నిర్ధారించుకున్నారు. ఇప్పటికే ఆరు ప్రత్యేక బృందాలు పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండగా రెండు రోజులుగా పంబాపూర్ అడవుల్లోనే మకాం వేయడంతో అప్రమత్తమయ్యారు. అయితే శుక్రవారం సాయంత్రం పక్కనే ఉన్న మంగపేట మండల పరిధిలోకి వచ్చే కొత్తూరు మొట్లగూడెం అడవుల్లో పులి సంచరిస్తున్నట్లు అక్కడి ప్రజలు భయాందోళన వ్యక్తం చేశారు. చీపురుపుల్లల సేకరణకు అడవిలోకి వెళ్లిన ఓ వృద్ధుడు పొట్టయ్యకు గండిఒర్రె ప్రాంతంలో పెద్దపులి తారసపడడంతో భయంతో వణికిపోయిన ఆయన గ్రామంలోకి పరుగుపెట్టాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు వాస్తవాలను పరిశీలిస్తున్నారు. పులి సంచరిస్తోందని, ఒంటరిగా అడవిలోకి, పొలాల వద్దకు వెళ్లవద్దంటూ కొత్తూరు మొట్లగూడెం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చాటింపు వేయించారు.


తాడ్వాయి అడవుల్లో పెద్దపులి పాదముద్రలను పరిశీలిస్తున్న సిబ్బంది


మల్యాలలోని బోడ సుందర్‌కు చెందిన మిర్చితోటను పరిశీలిస్తున్న వైస్‌ఛాన్సలర్ రాజిరెడ్డి

'ఉద్యాన పంటలకే మంచి భవిష్యత్'

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఉద్యాన పంటలకే మంచి భవిష్యత్ ఉంటుందని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ దండె రాజిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలం మల్యాలలోని జెన్నారెడ్డి వెంకటరెడ్డి ఉద్యానపరిశోధన స్థానంలోని జామ, మామిడి, సపోట, నిమ్మ కరోనా, జన్యు సంపదను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తోటలోని కొన్ని జామ నూతన (జామ మదర్‌బ్లాక్) మొక్కలను వైస్ చాన్సలర్ నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిశోధన స్థానంలో జరుగుతున్న పరిశోధనను, వాటి ఫలితాలను శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ విలేకరులతో మాట్లాడుతూ ఉద్యాన పంటలకే ప్రాముఖ్యత ఉందని, ఆ పంటలపై జరుగుతున్న పరిశోధనల విషయాలను రైతులకు ఎప్పటికప్పుడు చేరవేస్తున్నట్లు చెప్పారు. కాగా, మల్యాల ఉద్యాన కళాశాలలో బీఎస్సీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ ఉద్యాన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డాక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్నతో పాటు జేవీఆర్, కేవీకే శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కొత్తగూడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :ఈనెల 15న(రేపు) భూక్య జంపన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తగూడలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు భూక్య జంపన్న తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కంటి లోపం ఉన్నవారికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేయిస్తామని పేర్కొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2427	2080
పల్లికాయ (సూక)	4320	4000
పల్లికాయ (పచ్చిది)	5850	5500
కందులు	-	-
పెసళ్లు	5666	5000
పత్తి	7010	5800
పసుపు (కాడి)	10899	10000
పసుపు (గోల)	10729	10500
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	15561	12000
తేజ ఏసీ	15500	14000
వండర్‌హాట్ ఏసీ	13000	11000
యూఎస్341ఏసీ	14500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

పత్రికి పాటంటే ప్రాణం..

- 5వేల చరణాలతో అతి పెద్ద గేయం
- 50 గంటల ఆడియోతో ప్రపంచ రికార్డు
- ఔరా అనిపిస్తున్న గాయకుడు, కళాకారుడు కుమారస్వామి



పాట పాడుతున్న పత్రి కుమారస్వామి

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పాట పాడుతున్న పత్రి (ఫైల్)

వరంగల్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాటలంటే ఆయనకు ప్రాణం. జానపద గేయాలతో ప్రారంభమై సామాజిక సమస్యలు.. ఆధ్యాత్మిక భావనలపై అందరినీ హత్తుకునే పాటలను పాడుతూ ప్రపంచంలోనే ఎవరూ రాయని ఎవరూ పాడని అతి పెద్ద పాటను పాడి వార్తల్లోకి ఎక్కిన వ్యక్తి పత్రి కుమారస్వామి. 5 వేల పదాలతో 50 గంటల పాటు పాట పాడి ఆ ఆడియోతో ప్రపంచ రికార్డును సాధించారు. కళాకారుడిగా ప్రస్థానం ప్రారంభించిన నగరానికి చెందిన పత్రి కుమారస్వామి ఆయుర్వేద వైద్య చిట్కాలను శోధన చేస్తూ పాత్రికేయ వృత్తిని ప్రారంభించి గాయకుడిగా తన జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

విద్య, కళాకారుడిగా ప్రస్థానం

వరంగల్ కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన పత్రి కట్టయ్య, మల్లికాంబ దంపతుల కుమారుడు కుమారస్వామి చిన్నతనం నుంచే కళను నేర్చుకుంటూ విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. సీకేఎం కళాశాలలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసి లక్ష్మి ఆయుర్వేద కళాశాలలో ఆయుర్వేద శోధనతో విద్య పూర్తి చేసి కాకతీయ యూనివర్సిటీలో ఎంసీజే చదివారు. హైదరాబాద్‌లోని ఆకాశవాణి కేంద్రంలో సంగీత జానపద ఉత్సవం లో ఏ - గ్రేడ్ ఆర్టిస్టుగా 2003లో ఎంపికయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో జానపద సంగీత పోటీలలో ఏ - గ్రేడ్ కళాకారుడిగా కుమారస్వామి ఒక్కరే ఎంపికయ్యారు. జిల్లా, రాష్ట్రస్థాయి జానపద పాటల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు.

యాంకర్‌గా, గాయకుడిగా టీవీల్లో ప్రదర్శనలు..

గాయకుడిగా 35సంవత్సరాలుగా పూర్వ దూరదర్శన్, ప్రస్తుత యాదగిరి ఛానల్‌తో పాటు ఆకాశవాణిలో వందల కొద్ది పాటలు ఆలపించారు. ప్రపంచంలో అతి పెద్ద జాతరైన మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరలో ప్రత్యక్ష ప్రసారంలో భాగంగా అమ్మవార్ల పాటను దూరదర్శన్‌లో పాటపాడి అందర్నీ మంత్రముగ్ధుల్నీ చేశారు. ఇక 5 వేల పదాలను పాటగా పత్రి కుమారస్వామి 50 గంటల పాటు పాడి ప్రపంచంలోనే ప్రపంచ రికార్డులో నిలిచారు. ఈ పాటను సీఎం రేవంత్ రెడ్డి ఎదుట ఆలపించి ఆయన అభినందనలు అందుకున్నారు. ఇదే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలు నిర్వహించి పాల్గొని ప్రముఖుల మన్ననలు పొందారు. మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పత్రి ప్రదర్శనలను తిలకించి ప్రశంసించారు. 50 గంటల పాటు 5 వేల చరణాలతో రాసి పాడిన పాట అందులో ప్రతీ అక్షరం సమాజానికి ఉపయోగపడేలా రాసినట్టు పత్రి కుమారస్వామి తెలిపారు. సమాజంలో రుగ్మతలను రూపుమాపి సమాజాభివృద్ధికి తోడ్పడేలా రాసిన పత్రికి గిన్నిస్ రికార్డును అందించాలని ఆయన అభిమానులు కోరుతున్నారు.



కళాకారుడైన పత్రిని సన్మానిస్తున్న మేయర్ గుండు సుధారాణి (ఫైల్)



వంశీ ఆర్ట్స్ వారు పత్రిని సన్మానించిన దృశ్యం (ఫైల్)

కథ

పాటల పూదోట వెంకటలక్ష్మీ

- రచయితగా, గాయకురాలిగా రాణిస్తున్న అంగన్‌వాడీ టీచర్
- ఉత్తమ రచయితగా అవార్డులు, ప్రశంసలు
- 500కుపైగా జనచైతన్యగీతాల రచన



ఢిల్లీలో అంబేద్కర్ అవార్డు అందుకుంటున్న తొట్ల వెంకటలక్ష్మీ (ఫైల్)



ఢిల్లీలో అంబేద్కర్ అవార్డు అందుకుంటున్న తొట్ల వెంకటలక్ష్మీ (ఫైల్)

నెల్లికుదురు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కడుపేదరికం.. సమాజంలో జరుగుతున్న రుగ్మతలు.. అవాంఛనీయ ఘటనలు.. చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న కార్మికుల కష్టాలు.. దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు.. దోపిడీల లాంటి సంఘటనలు ఆమెను కవిగా, గాయకురాలిగా మలిచాయి. అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను గళం వినిపించేలా పురిగొల్పాయి. ఈ క్రమంలోనే సుమారు 500కుపైగా జనచైతన్య గీతాలను రచించి ఔరా అనిపించుకుంటున్నారు నెల్లికుదురు మండలంలోని వస్రాంతండాలో అంగన్‌వాడీ టీచరుగా విధులు నిర్వహిస్తున్న తొట్ల వెంకటలక్ష్మీ. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలో తొట్ల వీరయ్య, చిన్నవెంకటమ్మ దంపతుల చిన్నకూతురైన వెంకటలక్ష్మీ వివాహం అనంతరం నెల్లికుదురు మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. 20ఏళ్ల క్రితం అంగన్‌వాడీ టీచరుగా ఉద్యోగం సాధించిన ఆమెకు చిన్ననాటి నుంచి జానపద గేయాలు, గ్రామాల్లో వ్యవసాయ కూలీలు పాడేపాటలు అంటే మక్కువ. అంగన్‌వాడీలకు సరైన గుర్తింపు, వేతనాలు లేకపోవడంతో వేతనాలు పెంచాలని సమ్మెలు, ధర్నాలు ర్యాలీలు చేస్తున్న క్రమంలో ఆమె స్వయంగా పాటలు రాసి, బాణీలు కట్టి, సమ్మెలలో పాటలు పాడటం మొదలుపెట్టారు. అనంతరం తెలంగాణ ఉద్యమ సమయంలో ఆమెలో దాగిఉన్న కళ బయట కొచ్చింది. రాష్ట్రం సిద్ధించాక తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న క్రమంలో వందలాదిగా బతుకమ్మ పాటలు రాసి పుస్తకం రచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిరోజు విధులు నిర్వహిస్తూ తీరిక సమయంలో పాటలు రచిస్తూ ఢిల్లీలో, హైదరాబాద్‌లో పలువురి మన్ననలు, ప్రశంసలు పొందారు. ఇప్పటి వరకు 500 వరకు వివిధ రకాల జనచైతన్య గీతాలు రచించి, పుస్తకం ముద్రించింది. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై పాటలు రచించి, మహిళలలో చైతన్యం రగిలించి, నిరక్ష్యరాస్యత నిర్మూలనపై మహిళలతో నృత్యాలు వేయిస్తూ మహిళలలు అన్నిరంగాలలో రాణించాలని ఉత్తేజపరుస్తూ వాగ్గేయకారిణిగా ముందుకు సాగుతున్నారు.



పలు అవార్డులు సొంతం

2015లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సాహితీవేత్త అవార్డుతో పాటు రూ.10,116 నగదు పురస్కారం అందుకున్నారు. 2016లో ఢిల్లీలో సాయిత్రిబాయి పూలే అవార్డు, 2017లో ఢిల్లీలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అవార్డు, అదే ఏడాది జిల్లాస్థాయి ఉత్తమ గాయని అవార్డు అందుకున్నారు. 2017లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల జిల్లాస్థాయిలో ప్రశంస పత్రం అందుకున్నారు.

నిరక్ష్యరాస్యత నిర్మూలనకు కృషి



పాటలు, నృత్యాలతో నిరక్షరాస్యత నిర్మూలనకు నా వంత కృషిచేస్తా. నిరక్షరాస్యతతో సమాంజంలో అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నాయి. ఇప్పటికీ చాలామంది ఆడపిల్లలు ఉన్నత చదువులకు నోచుకోవడం లేదు. చిన్న తనంలోనే వివాహాలు చేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను కోల్పోతున్నారు. మహిళ కళాబృందాన్ని ఏర్పాటు చేసి జానపద పాటలతో నృత్యాలతో బాల్యవివాహాల నివారణపై మార్పు తీసుకరావడానికి కృషి చేస్తున్నా. దాతలు ఆర్థికంగా సహకరిస్తే నేను రచించిన పాటలను ఆల్బంగా తయారు చేసి, అన్నివర్గాల ప్రజలను ఆలోచింపజేసేలా ప్రదర్శిస్తా.

- వెంకటలక్ష్మీ

అలెర్ట్

మైనర్లూ.. బండ్లు నడపొద్దు

- నగరంలో యథేచ్ఛగా మైనర్ డ్రైవింగ్
- మితిమీరిన వేగంతో ప్రమాదాల పాలవుతున్నవైనం
- తల్లిదండ్రులూ జాగ్రత్త పడాల్సిందే..



మట్టెవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు నడపడమంటే.. హ్యాండిల్ పట్టుకోవడమో.. స్టీరింగ్ తిప్పడమో వస్తే సరిపోదు. రోడ్డురవాణా శాఖ నిబంధనలు తెలిసిఉండాలి. లేదంటే ప్రమాదాలకు గురవక తప్పదు. ఇక మైనర్ డ్రైవింగ్ అయితే పోలీసులు తీసుకునే చర్యలను ఎదుర్కోవాల్సిందే. నగరంలో రోజురోజుకూ వాహనాలు నడిపే పిల్లల సంఖ్య ఎక్కువవుతోంది. పదేళ్ల నుంచి 15 ఏళ్ల బాలబాలికలు కార్లు, ద్విచక్రవాహనాలతో రోడ్లపైకి దూసుకువెళ్తున్నారు. రయ్‌మంటూ డ్రైవింగ్ చూస్తూ.. రాంగ్ రూట్లలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులునమోదు చేస్తున్నా అలాంటి వారిలో మార్పు రావడం లేదని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. కొందరు తల్లిదండ్రులు మైనారిటీ తీరిందా లేదా? రోడ్డు నిబంధనలు వారికి తెలుసా లేదా అనేది కూడా చూడకుండా తమ పిల్లలకు ఖరీదైన వాహనాలను కొనిస్తున్నారు. దాంతో పిల్లలు ఉత్సాహంతో మితిమీరిన వేగంతో వారు ప్రమాదాల బారిన పడి ప్రాణాలపైకి తెచ్చుకోవడంతో పాటు.. ఎదుటి వారిని కూడా ప్రమాదాలకు గురిచేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు.

పిల్లల చేతికి వాహనాలు..

ప్రమాదకరమని తెలిసినా కొందరు తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇస్తున్నా రు. మైనర్‌లు వాహనాలు నడిపితే అనర్థాలు తప్పవని పోలీస్ అధికారులు చెపుతున్నా పట్టించుకోవడం లేదు. ఫలితంగా ట్రాఫిక్ మధ్య వాహనాలు నడిపే అనుభవం లేకపోవడం, వాహనాన్ని అదుపు చేసే శక్తి సామర్థ్యాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేగాకుండా ఇటీవల ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో అనేక మంది పట్టుబడ్డారు. వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినా డ్రైవింగ్ మాత్రం మానుకోవడం లేదన్నది అర్థమవుతోంది. మైనర్‌ల డ్రైవింగ్‌తో నగరంలో అనేక అనర్థాలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం వరంగల్‌లో ఓ మైనర్ స్కూటీ నడుపుతూ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా మరో బాలుడు బైక్ నడుపుతూ ఓ వృద్ధుడిని ఢీకొట్టడంతో ఆ వృద్ధుడి కాలు విరిగింది. ఈ ఘటనలో ఆ మైనర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి.

ఈ ఏడాది నగరంలో నమోదైన మైనర్ డ్రైవింగ్ కేసులిలా..

వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీస్ పరిధిలో మైనర్ల డ్రైవింగ్ రోజురోజుకూ పెరుగుతోంది. వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 104 కేసులు, హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 176, కాజీపేట పరిధిలో 17 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా 297 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదైనట్టు ట్రాఫిక్ పోలీసుల రికార్డులు చెబుతున్నాయి.

డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే...

మోటార్ వెహికిల్ చట్టం ప్రకారం సెక్షన్ నంబర్ 181 కింద జరిమానా విధిస్తారు. సెక్షన్ 180కింద వాహన యాజమానికి సైతం జరిమానా విధిస్తారు. తల్లిదండ్రులపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు. తల్లిదండ్రులు జువైనల్ జస్టిస్ బోర్డు లేదంటే కోర్టుకు, లేకపోతే పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది.

కొత్తరకం దేశీయ పత్తి రకాల సృష్టి

వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల కృషి



పత్తి మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు 13 : (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కొత్తరకం దేశీయ పత్తి రకాల(వెరైటీ)లను సృష్టిస్తున్నారు. నీటి వసతి లేకున్నా.. పంట ఎండిపోకుండా, చీడపీడల నుంచి తట్టుకునేలా అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ అధిక దిగుబడులిచ్చేలా పత్తి రకాలను సృష్టిస్తున్నారు. ఈ రకమైన పత్తిని స్థానిక పరిశోధన కేంద్రంలో ఆరేళ్లుగా ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. మరి కొన్నాళ్ల పాటు పరీక్షిం చి అత్యుత్తమ ఫలితాలు వచ్చిన తరువాత రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ రకాలు రైతులకు అందుబాటులోకి వస్తే బయటి విత్తనాలు కొనే అవసరం ఉండదు. సాగు చేసిన పంట నుంచే గింజలను తీసి తిరిగి విత్తుకోవచ్చు. హైబ్రిడ్ కొత్త వంగడాల విత్తనాలను సాగు చేసే రైతులకు ఈ అవకాశం ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తెలంగాణలో పత్తి సాగుకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని అంటు న్నారు. ఇప్పుడు అభివృద్ధి చేసే కొత్త రకాలు రైతులకు ఆమోదయోగ్యంగా ఉంటాయని చెబు తున్నారు. ఈ కొత్తరకాలను తొలుత ఈ పరి శోధన కేంద్రంలోని ఉమ్మడి ఖమ్మం, మెదక్, వరంగల్ జిల్లాలో ప్రయోగాలు చేసి దశలవారీగా రాష్ట్రమంతా విస్తరించేలా ప్రయత్నం చేస్తు న్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

- త్వరలో చేతికి రానున్న మొదటి పంట
- కనిపించని మార్కెటింగ్ జాడ
- ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలదే బాధ్యత అంటున్న అధికారులు
- ఇప్పటికీ ప్రారంభం కాని ఫ్యాక్టరీల ఏర్పాటు ప్రక్రియ
- రాష్ట్ర వ్యాప్తంగా 1.99 లక్షల ఎకరాల్లో సాగు



సాగు సరే... పరిశ్రమ ఏది?



త్రిశంకు స్వర్గంలో ఆయిల్‌పామ్ రైతులు



(ఆంధ్రజ్యోతి భూపాలపల్లి) : రాష్ట్రంలో ఆయిల్‌పామ్ మొదటి పంట చేతికొస్తోంది. అయినా పంట కోత, ఫ్యాక్టరీలకు తరలింపు, మార్కెటింగ్ వంటి అంశాలు రైతన్నలను గందరగోళానికి గురిచేస్తున్నాయి. నాలుగేళ్లుగా ప్రభుత్వం చెప్పినట్లుగా ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ , రిఫైనరీల ఏర్పాటు ఇంకా కొలిక్కి రాలేదు. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో 2020-21లో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో మొత్తం 1.99లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఇందుకు ప్రభుత్వం వివిధ ఏజెన్సీలతో మొక్కల పంపిణీ మొదలుకొని రైతుల పంట కొనుగోలు వరకు ఆయా ఏజెన్సీలకే బాధ్యతలను అప్పగిస్తూ ఒప్పందం చేసుకుంది.. ఈ క్రమంలో రాష్ట్రంలోని మొత్తం 14 ఏజెన్సీలు రిఫైనరీల ఏర్పాటుకోసం అంగీకారం కుదుర్చుకుంది. అయితే మొక్కలు నాటిన మూడేళ్ల తర్వాత ఆయిల్ హార్వెస్టింగ్ జరిగే అవకాశం ఉంటుందని ముందే తెలిసినా ఇప్పటి వరకు ఆయా ఏజెన్సీలు పరిశ్రమల స్థాపించడంలో పూర్తిగా విఫలమయ్యాయి. ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా సహా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ గెలలు కోతకు వచ్చినట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. భూపాలపల్లి జిల్లాలో సాగు చేసిన మొత్తం 3650 ఎకరాలకు ఈ ఏడాది దాదాపు 353ఎకరాల్లో మొదటి సారి ఆయిల్ పామ్ గెలలు హార్వెస్టింగ్ జరుగనున్నాయి. రైతులు, అధికారుల మాటలనుబట్టి మరో రెండు నెలల్లో ఈ పంట హార్వెస్టింగ్ పూర్తి కావాల్సి ఉంది. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ రైతుల నుంచి పంటను కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆ సంస్థ మొక్కలు అందజేయడం మొదలుకొని ఉత్పత్తి కొనుగోలు వరకూ బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. రైతులకు మొక్కల సరాఫరా చేసినందుకు ఒక్కో మొక్కపై రూ. 193ను సబ్సిడీగా అందజేస్తోంది. ఈ లెక్కన ఒక్కో ఎకరాకు 57 మొక్కలకు రూ. 11,001ను ఖర్చు చేస్తోంది. జిల్లాలో మొదటిసారి ఆయిల్‌పామ్ చేతికొస్తుందని రైతులు ఆనందించే లోపు ఇంకా ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకాలేదన్నా సమాచారం ఆందోళనకు గురిచేస్తోంది. రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది.

పరిశ్రమల మంత్రి ఇలాకాలోనే పరిశ్రమ కరువు

పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న భూపాలపల్లి జిల్లాలోనే ఆయిల్‌పామ్ పరిశ్రమకు మోక్షం కలగలేదు. ఓ వైపు పంట చేతికొస్తున్నా, ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ పరిశ్రమ నిర్మాణాన్ని ప్రారంభించకుండా తాత్సారం చేయడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. భూపాలపల్లి జిల్లాలో రైతులు పండించే ఆయిల్‌పామ్‌ను సేకరించి రిఫైన్ చేయడం కోసం జిల్లాలోని చిట్యాల మండలం నైన్‌పాకలో రిఫైనరీని ఏర్పాటు చేయాలని తలపెట్టినా ఇప్పటికీ అక్కడ ఎలాంటి నిర్మాణాలు ప్రారంభం కాలేదు. అయితే రిఫైనరీ ఫ్యాక్టరీ నడవాలంటే కనీసం 20వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉండాలని, అప్పుడే నిరంతరం దిగుబడులు వస్తే తప్ప పరిశ్రమ నడిచే పరిస్థితి ఉండదని అంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో 3650 ఎకరాల్లో మాత్రమే పంట సాగు చేయగా ఇందులో ఈ ఏడాది 353ఎకరాలకు సంబంధించి మాత్రమే పంట కోతకు వచ్చే పరిస్థితి ఉంది. దీంతో సంస్థ వేచిచూసే ధోరణి అనుసరిస్తోందని తెలుస్తోంది. జిల్లాలో పరిశ్రమల స్థాపించేందుకు ముందుకు వచ్చిన సువెన్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పంటను కొనుగోలు చేస్తుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ ఇప్పటీ వరకు దీనిపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రైతులను అయోమయానికి గురి చేస్తోంది. ఇదిలా ఉండగా మొదటి కోత జరిగిన 24గంటల్లోపే ఆయిల్‌పామ్ గెలలను ఫ్యాక్టరీకి తరలించాల్సి ఉంటుందని, లేని పక్షంలో నూనె శాతం తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలో రెండు మినహా ఎక్కడా పరిశ్రమలు నిర్మాణం కాకపోవడంతో మొదటి పంటను రైతులు వదులుకోవాల్సిందేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యేదెన్నడు!

- కాటారం-విలాసాగర్ రోడ్డుకు మూడేళ్ల క్రితం శంకుస్థాపన
- నేటికీ పూర్తిస్థాయిలో జరగని పనులు
- కంకర రోడ్డుతో ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

కాటారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాలు వెళ్లే విధంగా చేపట్టిన రహదారి విస్తరణ పనులు నత్తకు నడక నేర్పిస్తున్నట్లుగా మూడేళ్లు దాటినా కొనసా..గుతూనే ఉన్నాయి. గ్రామాల పరిధిలో సీసీ రోడ్లు వేసి ఇతర ప్రాంతాల్లో మాత్రం తారు పూర్తిగా తీసేసి కంకర పోయడంతో వాహనదారులు కంకర రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు, ప్రమాదాల బారిన పడుతున్నారు. పలువురు బైక్‌లతో జారిపడి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రుల పాలవుతున్నారు. మండలంలోని కాటారం నుంచి విలాసాగర్ వరకు వయా ఆదివారంపేట, పరికిపల్లి, గుమ్మళ్లపల్లి మీదుగా రహదారి విస్తరణ(ఐదున్నర మీటర్లు) కోసం పీఎంజీఎస్‌వై(ప్రధానమంత్రి గ్రామీణ్ సడక్ యోజన)-3 బ్యాచ్-2 కింద రూ.9 కోట్ల ఐదున్నర లక్షల నిధులు మంజూరు అయ్యాయి. 2021 సెప్టెంబరులో అప్పటి పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేష్, పెద్దపల్లి, భూపాలపల్లి జడ్పీ ఛైర్మన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా పనులు నిర్వహిస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం 11 కిలోమీటర్ల మేర చేపట్టిన రహదారి విస్తరణ పనులు ఇంకా పూర్తి కాలేదు. కాంట్రాక్టు పొందిన నిర్వాహకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో తారురోడ్డు నిర్మాణం పూర్తికాక కంకరతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, కాంట్రాక్ట్ పొందిన వారి నుంచి ఇతరులు సబ్ కాంట్రాక్ట్ తీసుకుని పనులు చేయగా బిల్లులు మంజూరైనా సదరు కాంట్రాక్ట్ నిర్వాహకులకు పూర్తిగా అంద కపోవడంతోనే పనులు జరగడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. గ్రామాల పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణం జరగడంతో వాహనదారులు వేగంగా వచ్చి కంకరరోడ్డుపై కింద పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి విస్తరణ పనులు పూర్తయ్యేలా చూడాలని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



వాహనదారులకు ఇబ్బందిగా మారిన కంకర రోడ్డు

కంకర రోడ్డుపై జారిపడి పలువురికి గాయాలు

సూరం మహేష్, ఆదివారంపేట



రోడ్డు విస్తరణ పనులు పూర్తికాక పోవడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర రోడ్డుపై బైక్‌లు, ద్విచక్ర వాహనాలు జారిపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. ఆటోలు దెబ్బతింటున్నాయి. మూడేళ్లు గడిచినా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బీఆర్‌ఎస్ నేతలు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పోరిక గోవింద్‌నాయక్, పాలెపు శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు రైతును రాజు చేస్తామని ప్రగల్భాలు పలికి తేమ పేరుతో కోతలు విధిస్తుందని అన్నారు. అదేవిధంగా క్వింటాకు రూ.500 బోనస్ కూడా ఇవ్వడం లేదని రైతులు పేర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సానికొమ్ము ఆదిరెడ్డి, గడ్డమీది బాస్కర్, కప్పంపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- బ్రాంచి మేనేజర్ జ్యోతిబసు



బస్వరాజుపల్లిలో మాట్లాడుతున్న అధికారులు

గణపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ మేనేజర్ అజ్మీరా జ్యోతిబసు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ధర్మరావుపేట, పరుశురాంపల్లి, బస్వరాజుపల్లి, నగరంపల్లి, సీతారాంపురం, అప్పయ్యపల్లి గ్రామాల్లో డీసీసీబీ సేవలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవింగ్స్‌పై ఇతర బ్యాంకుల కన్నా అత్యధిక వడ్డీరేటు, బంగారు ఆభరణాలపై తక్షణ రుణం, వ్యవసాయం, వ్యాపారస్తుల రుణాలు, విద్యార్థులకు ఎడ్యుకేషన్ లోన్, మార్టిగేజ్, నూతన పరిశ్రమల ఏర్పాటు వంటి తదితర రుణాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత రైతులు ఎక్కువ మొత్తంలో రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ మేనేజర్ రమేష్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క సాగర్ బ్యారేజి నీటి విడుదల కొనసాగింపు

కన్నాయిగూడెం, డిసెంబరు 13: మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజి నుంచి నీటి విడుదల శుక్రవారం కొనసాగింది. ఎగువ నుంచి 15,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా బ్యారేజిలోని రెండు గేట్ల ద్వారా 13,924 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజి పూర్తి స్థాయి నీటి మట్టం 83 మీటర్ల వద్ద 6.94 టీఎంసీలు కాగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి తమ భూభాగంలోని పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని అభ్యంతరాలు తెలపటంతో పరిపాలన పరమైన అనుమతులు రాలేదు. అందుకోసం ముంపునకు గురికాకుండా ఎత్తు 79 మీటర్లకు తగ్గించి నీటిని నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజిలో 3.5 టీఎంసీల నీరు నిల్వ చేస్తున్నారు. ఇదిలావుండగా గుట్టల గంగారం వద్ద ఉన్న జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్ కొనసాగుతుంది.

19న మహా పడిపూజను దిగ్విజయం చేయాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లాకేంద్రంలోని రామాలయం ఆవరణలో ఈనెల 19వ తేదీన జరిగే మహా పడిపూజోత్సవాన్ని దిగ్విజయం చేయాలని అయ్యప్ప భక్తమండలి కోరింది. ఈ మేరకు శుక్రవారం రామాలయం ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను భక్తమండలి పరిశీలించింది. నర్సంపేటకు చెందిన దేవేశమిశ్రా గురుస్వామి చేతుల మీదుగా పడిపూజ మహోత్సవం జరుగుతుందని అన్నారు. ఉదయం 7గంటలకు నగర సంకీర్తన, 10గంటలకు పడిపూజ, మధ్యాహ్నం 12.30గంటలకు అన్నదానం ఉంటుందని భక్తమండలి తెలిపింది.

రెండో రోజు కొనసాగిన ఉపాధ్యాయుల నిరసన

మొగుళ్లపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కొరికిశాల ఆదర్శ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు రెండో రోజు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్లకార్డులు చేబూని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 010 పద్దు ద్వారా వేతనాలు అందించాలని, పీఆర్సీ నందు నష్టపోయిన ఉపాధ్యాయులకు నోషనల్ సర్వీస్ కల్పించాలని, పదోన్నతులు చేపట్టాలని, హవర్లీ బేస్డ్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాంకోటేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడాపోటీల్లో విద్యార్థినికి అస్వస్థత

- ఇద్దరికి స్వల్ప గాయాలు
- వరంగల్ ఎంజీఎంకు ఒకరి తరలింపు
- చికిత్స పొందుతూ కోలుకుంటున్న విద్యార్థిని

ఏటూరునాగారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడల్లో ముగ్గురు బాలికలు అస్వస్థతకు గురైన సంఘటన ఏటూరునాగారం మండలంలో చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం ఏటూరునాగారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(జడ్పీహెచ్‌ఎస్) క్రీడా మైదానంలో సీఎం కప్ క్రీడలు ప్రారంభమయ్యాయి. అందులో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, మండలంలోని రామన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని గుగ్గూరి గోపిక స్పృహ కోల్పోయింది. ఈ విషయం తెలుసుకున్న పీఈటీలు వెంటనే ముందుగా మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరీక్షించిన వైద్యులు గోపిక పూర్తిగా స్పృహ కోల్పోవడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఎంఈవో కథనం మేరకు.. ముందుగా కబడ్డీ ఆడిన గోపిక తర్వాత 200 మీటర్ల పరుగుపందెంలోనూ పాల్గొని గెలిచింది. ఆ తర్వాత 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న సమయంలో స్పృహ తప్పి అలసి కుర్చీలో కూర్చుని ఒక్కసారిగా స్పృహ కోల్పోయిందని, కళ్లు మూతపడి నోటి వెంట మాట రాలేదని తెలిపారు. వెంటనే ఆ విద్యార్థిని గుర్తించిన పీఈటీలు, సిబ్బంది ఆస్పత్రికి తరలించారన్నారు. గోపికకు స్కానింగ్, ఇతర పరీక్షలు చేశారని, వైద్యులు గుండెకు నీరు వచ్చినట్లు గుర్తించారని ఎంఈవో మల్లయ్య తెలిపారు. అయితే గోపిక స్పృహ కోల్పోయినప్పుడు వైద్య సిబ్బంది ఏటూరునాగారంలో అందుబాటులో లేకపోవడంతో పీఈటీలు కుమారస్వామి, సిబ్బంది గోపికకు సీపీఆర్ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం అస్వస్థతకులోనైన గోపిక వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటుందని ఎంఈవో మల్లయ్య తెలిపారు.



వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో గోపిక ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

గోపికకు మెరుగైన వైద్యం : డీఎంహెచ్‌వో

ములుగు కలెక్టరేట్ : ఏటూరునాగారంలో జరిగిన సీఎం కప్ పోటీల్లో గురువారం అస్వస్థతకు గురైన గగ్గూరి గోపిక అనే విద్యార్థిని వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతోంది. శుక్రవారం బాలికను పరామర్శించిన డీఎంహెచ్‌వో గోపాల్‌రావు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్‌ను కోరారు. ప్రస్తుతం గోపిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వెల్లడించారు.

డిస్కమ్‌లను ప్రైవేటీకరణ చేయొద్దు

గణపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్, చండీఘర్ రాష్ట్రాలలో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఉద్యోగులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన సమయ విరామంలో సర్వీస్ బిల్డింగ్ వద్ద డిస్కమ్ సంస్థలను ప్రైవేటీకరణ చేమొద్దంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం కేటీపీపీ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో జరగగా, అన్ని సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

కాకతీయఖని : ఉత్తర్‌ప్రదేశ్, చండీఘర్ రాష్ట్రాలలో విద్యుత్‌ను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి జంగేడు సబ్‌స్టేషన్ ఎదుట భోజన విరామం సమయంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడాన్ని ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకోమన్నారు. కార్యక్రమంలో భాస్కర్, సురేందర్, చందు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

రేగొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని మడ్తపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... మామడిశెట్టి మధు(65) కొన్నేళ్లుగా గుండెకు సంబంధించిన వ్యాధితో పాటు అస్తమాతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఓ రసాయనం తాగగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడన్నారు. కుమారుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై చెప్పారు.

పెండింగ్ మెస్ బిల్లులు విడుదల చేయాలి

ఏటూరునాగారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టల్లో పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్.రవి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత మూడు నుంచి నాలుగు నెలలుగా గిరిజన సంక్షేమ హాస్టల్లో మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో వార్డెన్లకు తీవ్రమైన ఆర్థిక సమస్యను కలిగిస్తున్నదని తెలిపారు.

అక్రమంగా దాచిన టేకు కలప స్వాధీనం

వాజేడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదలకు కొట్టుకువచ్చిన విలువైన టేకు కలపను గుర్తు తెలియని వ్యక్తులు గోదావరి ఒడ్డు ప్రాంతంలో భద్రపరిచారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్రమంగా దాచిపెట్టిన కలపను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం వాజేడులోని గోదావరి తీరంలో సుమారు 7 పెద్ద దుంగలను స్వాధీనం చేసుకొని వెంకటాపురం రేంజ్ కార్యాలయంకు ట్రాక్టర్‌లో తరలించారు. ఈ విషయంపై ఎఫ్ఆర్‌వో చంద్రమౌళిని వివరణ కోరగా టేకు కలప స్వాధీనం చేసుకున్న విషయం నిజమేనని, పట్టుకున్న టేకు కలప విలువను కొలతలు వేసిన అనంతరం వెల్లడిస్తామని చెప్పారు. ఇదిలావుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు గోదావరి వెంబడి ప్రతి ఏటా రూ.లక్షల విలువైన టేకు కలప వరదలకు కొట్టుకువస్తుంది. కొట్టుకు వచ్చిన కలపను అక్రమార్కులు పడవల సాయంతో పట్టుకొని విక్రయాలు జరుపుతున్నారు. పట్టుకున్న టేకు కలపను గోదావరి ఒడ్డులోని రహస్య స్థావరాలలో భద్రపరిచి లక్షల్లో సంపాదిస్తున్నారు. అడపా దడపా ఫారెస్టు అధికారులు దాడులు జరిపినప్పటికి కలప దొరికేది గోరంత మాత్రమేనని, ఇంకా విలువైన కలప గోదావరి ఒడ్డు ప్రాంతాలలో చాలా ఉందని బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫారెస్టు అధికారులలో కొంత మంది చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల అనేక ఆరోపణలు వస్తున్నాయి.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కాకతీయఖని, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణరంగ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 40వేల మంది భవన నిర్మాణ రంగం కార్మికులు ఉన్నారని అన్నారు. వారు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలపై అసిస్టెంట్ లేబర్ అధికారికి వినతి పత్రాన్ని అందించామని తెలిపారు. కార్యక్రమంలో లావణ్య, వసంత, అనిత, రాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నంపల్లి- దేవగిరిపట్నంకు తారు రోడ్డు వేయాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ములుగు మండలంలోని అన్నంపల్లి-దేవగిరిపట్నంకు తారు రోడ్డును నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎమ్డీ.అమ్జద్‌పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రోడ్డును పరిశీలించి మాట్లాడారు. అన్నంపల్లి నుంచి దేవగిరిపట్నం వరకు కంకర రోడ్డు నిర్మించి ఏడాది దాటుతున్నా తారు వేయకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తరచూ ప్రమాదాలు జరిగి పలువురు గాయపడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు మేల్కొని తారు రోడ్డు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట ప్రజా సంఘాల నాయకులు ఎమ్డీ.మదార్, సుబ్బారెడ్డి, స్వామి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

50 వసంతాల సభలను జయప్రదం చేయాలి



ములుగులో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ పీడీఎస్ నాయకులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 14, 15వ తేదీల్లో జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల సభలను జయప్రదం చేయాలని పీడీఎస్ పూర్వ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ములుగులో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సాక్షిభూతంగా నిలిచిన అరుణోదయ సాంస్కృతిక సంస్థ హైదరాబాద్‌లో పురుడుపోసుకుని 50 వసంతాలు పూర్తవుతున్నాయని తెలిపారు. అరుణోదయ కళాకారులు తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి నున్న అప్పారావు, కవిత, దైద వెంకన్న, భీమన్న, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పలిమెల మండలంలోని పంకెన కేజీబీవీ పాఠశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు స్పెషల్ ఆఫీసర్ భవాని శుక్రవారం తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీషు, హిందీ సబ్జెక్టులను బోధించుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి తాత్కాలిక పద్ధతిన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఔత్సాహికులు ఈనెల 16వ తేదీ లోపు పంకెన కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తాడ్వాయి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వాసుదేవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు డీఏలు, పీఆర్సీ ప్రకటించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతన స్కేల్ ప్రకటించాలని, సర్వశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం ఈనెల 15న జరిగే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుతారి పాపారావు, ప్రధాన కార్యదర్శిగా ఆలెం భాస్కర్, ఉపాధ్యక్షుడిగా గుమ్మడి ప్రభాకర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా కొమరం శ్రీష, కోశాధికారిగా గట్టి సురేందర్, సభ్యులుగా లకావత్ సురేష్, టి.కోమల, చేలరాణి, యాప హనుమంతు, చింత సందీప్, ఎస్.రాజేష్, కె.నరేష్, జిల్లా కౌన్సిలర్‌గా పులిసెసమ్మయ్య, ఆడిట్ కన్వీనర్‌గా రమేష్, సురేందర్‌లు ఎన్నికయ్యారు.

పకడ్బందీగా బందోబస్తు చేపట్టాలి

- జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్



మంత్రుల పర్యటన బందోబస్తుకు సూచనలు చేస్తున్న బోనాల కిషన్

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో శనివారం జరిగే రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటన సందర్భంగా పకడ్బందీగా బందోబస్తు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్ సూచించారు. సభ జరిగే అంబేద్కర్ కూడలి ప్రాంతాన్ని శుక్రవారం ఆయన డీఎస్పీ సంపత్‌రావుతో కలిసి పరిశీలించారు. సభా స్థలి వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తవద్దన్నారు. మంత్రులు వచ్చి వెళ్లేంత వరకు నిరంతరంగా అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో భూపాలపల్లి, చిట్యాల సీఐలు నరేష్‌కుమార్, మల్లేష్, ఎస్సై ఓంపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు భగవద్గీత ఉపయోగకరం



సర్టిఫికెట్లతో విద్యార్థులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు భగవద్గీత ఎంతో ఉపయోగకరమని శ్రీ అరవింద ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ అక్కల సతీష్ అన్నారు. శుక్రవారం ములుగులోని పాఠశాల ఆవరణలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుని విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సతీష్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదివి అందులో ఉన్న విషయాలను తెలుసుకోవాలన్నారు. టీటీడీ కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం అభినందనీయమన్నారు. టీటీడీ ధర్మ ప్రచార మండలి జిల్లా సభ్యుడు దేవిరెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలు చదువుతుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుందని అన్నారు. అనంతరం సీనియర్ విభాగంలో ఎ.శ్రీకరణ్, ఎన్.రక్షిత, జి.లాస్య, పి.నితిన్, జూనియర్ విభాగంలో బి.అనన్య, సాయిప్రణీత్, రతన్‌తేజలు ఉత్తమ ప్రతిభ కనబర్చగా వారికి నగదుతోపాటు సర్టిఫికెట్లు, శ్రీమద్రామాయణ సంఘం పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు ముక్కు సుబ్బారెడ్డి, పోడిశెట్టి శేషాచార్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెండా గద్దెల కూల్చివేతపై ఫిర్యాదు

మల్హర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుద్రారంలో బీఆర్‌ఎస్, బీజేపీ జెండా గద్దెల కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం బీఆర్‌ఎస్, బీజేపీనాయకులు వేర్వేరుగా కొయ్యూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉద్దేశపూర్వకంగా జెండా గద్దెలను కూల్చివేసిన నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పగడాల నారాయణ, బుడిగే వెంకటేష్, తాజొద్దీన్, వాల యాదగిరిరావు, నొళ్ల సంపత్, రాజబాబు, పగడాల రామ్, సతీష్, ప్రశాంత్, సుమన్, వెంకటేష్, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు సబావత్ నాగరాజు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

మల్హర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని తాడిచర్ల ప్రభుత్వాస్పత్రి నూతన వైద్యాధికారి వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలోఆయన మాట్లాడుతూ సిబ్బంది వారికి నిర్దేశించిన టార్గెట్లను చేరుకునే లక్ష్యం దిశగా పనిచేయాలన్నారు. అనంతరం వైద్యాధికారిని సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డీడీవో డాక్టర్ సందీప్, వైద్యాధికారి రాజు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఇంధన పొదుపు పరిరక్షణ దినోత్సవం

మంగపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వికాస్ అగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ నాయిని వీరేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి హాజరై మాట్లాడారు. ఇంధన వనరులను ఆదాచేసి భావితరాలకు బహుమానంగా విద్యార్థులు ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మంగపేట ట్రెయినీ ఎస్సై సురేష్‌కుమార్, విద్యుత్ ఏఈ స్వర్ణ, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు సంతోష్‌కుమార్, రవీంద్ర నాయక్, రేణుకాదేవి, అనిల్‌కుమార్, లక్ష్మణ్, చిరంజీవి, వందన, వైష్ణవి, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడిచర్ల ఓసీపీలో భద్రతా వారోత్సవాలు

మల్హర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల ఓసీపీలో శుక్రవారం భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎం, డైరెక్టర్(ఓపీ) వెంకటేశ్వర్‌రావు విచ్చేసిమాట్లాడారు. మైన్‌లో భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మైన్‌లో పాటించాల్సిన భద్రత ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మైన్‌లో ప్రమాదాల నివారణకు చేపడుతున్న భద్రత పట్ల హర్షం వ్యక్తం చేసి పలు సూచనలు చేశారు. అలాగే 2023 వార్షిక సంవత్సరానికి గాను సేఫ్టీ అవార్డు మైన్‌కు రావడం పట్ల అధికారులను అభినందించారు. అనంతరం ట్రేడ్ టెస్టులో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కోల్, కమర్షియల్ సీఈ టీఎస్ జెన్‌కో జీవకుమార్, టీఎస్ జెన్‌కో జీఎం మోహన్‌రావు, ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్, సీనియర్ జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి, మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ సురేష్‌బాబు, ఏఎమ్మార్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

క్రీడాకారిణిని అభినందించిన మంత్రి శ్రీధర్‌బాబు



జ్యోతికి శాలువాతో సన్మానం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5న కంబోడియా దేశంలో ఇంటర్నేషనల్ పారా త్రోబాల్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించిన పలిమెల మండల కేంద్రానికి చెందిన యువతి కావేరి జ్యోతిని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం రాత్రి అభినందించారు. భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి పారా త్రోబాల్ సిట్టింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించగా.. ఆమె ఆ క్రీడలకు వెళ్లేందుకు మంత్రి శ్రీధర్‌బాబు చొరవ చూపించారు. కాగా, అంగవైకల్యాన్ని జయించి అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని ఖండాంతరాలను దాటించిన జ్యోతిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పలిమెల యూత్ కాంగ్రెస్ నాయకుడు దందేర రాజేందర్, విలాస్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా అష్టోత్తర శతనామ సంకీర్తనల స్వరాభిషేకం

కాటారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో అష్టోత్తర శత(108)నామ సంకీర్తనల స్వరాభిషేకం ఘనంగా గురు, శుక్రవారాల్లో జరిగింది. తెలంగాణ జైశ్రీరాం గాయక సమూహ సాహితీ వేదిక, ఆలయ దర్మకర్తల సహకారంతో సాహితీవేత్త పుల్లూరి నాగేశ్వర్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాలకు చెందిన పదుల సంఖ్యలో కవులు, గాయకులు స్వరాభిషేక మహాయజ్ఞంలో పాల్గొని శ్రోతలకు శ్రవనానందం కలిగించారు. 108 కీర్తనలు, 3 మంగళ నీరాజనాలతో కార్యక్రమం వైభవంగా సాగింది. గాయనీ గాయకులను, వాయిద్యకారులను ఆలయ ధర్మకర్త దుద్దిళ్ల జయశ్రీ, అర్చకుడు కృష్ణమోహన్‌శర్మ ప్రశంసా పత్రం, దత్తాత్రేయస్వామి చిత్రపటాలు, శేషవస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చంద్రమౌళి, మహేష్, రాజబాపు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గణపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం... మండల కేంద్రంలోని ఓ బిర్యాని కేంద్రంలో పనిచేసే శివ, వెంకటాపురం మండలం వెళ్తుర్లపల్లికి చెందిన అనిల్ బైక్‌లపై వస్తూ పెట్రోల్ బంక్ వద్ద ఎదురెదురుగా ఢీకొని గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.